# యాసంగి సాగుకు కరెంట్ కష్టాలు



అల్వాల్‌పాడు సబ్‌స్టేషన్‌లో కరెంట్ కోతలపై అధికారులను నిలదీస్తున్న రైతులు

- **కాల్వకు నీళ్లు వదిలి విద్యుత్ కోతలతో సేద్యం ఎలా సాధ్యం**
- **అల్వాల్ పాడులో రైతుల ఆగ్రహం**
- **సబ్ స్టేషన్ ఎదుట బైఠాయింపు**

ధరూరు, ఫిబ్రవరి 26 : యాసంగి సాగుకు ఈ కరెంట్ కష్టాలు ఏంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. మండలంలోని అల్వాల్‌పాడులో రైతులకు కరెంట్ కష్టాలు తప్పడం లేదు. దీంతో విసిగిపోయిన రైతులు గ్రామంలోని సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం బైఠాయించి నిరసన తెలిపారు. కాల్వకు నీళ్లు వదిలి కరెంట్ తీస్తం అంటే సేద్యం ఎలా సాధ్యమవుతుందని మండిపడ్డారు. సాగుకు కాళ్లేళ్ల పడి నీరు వదిలించుకుంటే, ఇక్కడ సబ్‌స్టేషన్‌లో కరెంట్ తీస్తే మోటార్లు ఎలా నడిసేది, పంటలు ఎలా తడుస్తాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏమి కాంగ్రెస్ ప్రభుత్వం, ఎందుకు ఈ కష్టాలు మాకు అంటూ కేటీదొడ్డి మండలంలోని మైలగడ్డ, బస్వాపురం, ఉమిత్యాల తండాల రైతులు సబ్‌స్టేషన్ అధికారులపై మండిపడ్డారు. రైతులు పంటలు పండించుకోవాలో లేక పంటలు ఎండిపోయి ఆగం కావాలో మీరే నిర్ణయించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ హయాంలో సాగునీటికి ఇబ్బంది లేదు.. కరెంట్‌కు పడిగాపులు లేవు కానీ ఈ ప్రభుత్వం హయాంలో ఎప్పుడు ఏదొక సమస్య రైతుపై పడుతుందని మండిపడ్డారు.

# శివరాత్రి ఉత్సవాల్లో అపశృతి



గుండాల కోనేరులో ఓమేశ్ మృతదేహం కోసం గాలిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్లో) ఓమేశ్ (ఫైల్)

- **గుండాల కోనేరులో ఇంటర్ విద్యార్థి గల్లంతు**
- **8 గంటలపాటు శ్రమించినా లభించని ఆచూకీ**

వెల్దండ, ఫిబ్రవరి 26 : శివరాత్రి ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకున్నది. గుండాలలోని కోనేరులో ఇంటర్ విద్యార్థి గల్లంతైన సంఘటన చోటు చేసుకున్నది. వివరాలిలా.. కల్వకుర్తి మున్సిపాలిటీ జేపీనగర్‌లోని గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న ఓమేశ్ (17) శివరాత్రిని పురస్కరించుకొని తోటి విద్యార్థులతో కలిసి బుధవారం ఉదయం 10 గంటలకు గుండాల పుణ్యక్షేత్రానికి వెళ్లారు. అక్కడ కోనేరులో స్నానం ఆచరిస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యాడు. తోటి విద్యార్థులు విషయాన్ని ఆలయ కమిటీకి తెలిపారు. వారు సమాచారం ఇవ్వగా.. పోలీసులు, దేవాదాయశాఖ, అగ్నిమాపక అధికారులు కోనేరు వద్ద గాలింపు చర్యలు చేపట్టారు. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై కురుమూర్తి, జియాగూడ కమేళ యాదవ సంఘం అధ్యక్షుడు జంగయ్యయాదవ్, ఉత్సవ కమిటీ చైర్మన్ అరుణ్‌నాయక్, కోటి యాదవ్ 8 గంటలపాటు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు కోనేరులో నీటిని ఐదు మోటర్ల ద్వారా బయటకు తోడేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, టాస్క్ సీవోవో రాఘవేందర్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు ఘటనా స్థలానికి చేరుకొని పర్యవేక్షించారు.

## రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

- **మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

గుండాల కోనేరులో గల్లంతైన విద్యార్థి మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. కోనేరు వద్ద గాలింపు చర్యలను ఆయన పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ పండుగపూట ఇంటర్ విద్యార్థి మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి మృతదేహాన్ని వెలికితీసి అతడి తల్లి దండ్రులకు అప్పగించాలన్నారు. విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రూ.10 కోట్లు మంజూరు చేసి గుండాల కోనేరును పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రావు, జోగయ్య, నిరంజన్, తారా సింగ్, శ్రీనునాయక్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్

## చెరువులో పడి మరొకరు..

లింగాల, ఫిబ్రవరి 26 : నల్లమల అటవీ ప్రాంతంలోని భౌరాపూర్ ఉత్సవాల్లో బుధవారం అపశృతి చోటు చేసుకున్నది. ఎస్సై నాగరాజు కథనం ప్రకారం బల్మూర్ మండలంలోని బిల్లకల్ గ్రామానికి వల్బాయి కృష్ణయ్య (40) మంగళవారం తన కుతూరుతో కలిసి బైక్‌పై భౌరాపూర్ ఉత్సవాలకు వెళ్లాడు. బుధవారం కుతూరుకు స్నానం చేయించి తర్వాత తాను కూడా స్నానం చేయడానికి చెరువుల్లో దూకాడు. ఈ క్రమంలో అతను లోపలే ఇరుక్కుపోయినట్లు తెలిపారు. కాగా మరో వ్యక్తి చెరువులో స్నానం చేస్తుండగా మృతుడి కాళ్లు తగలడంతో గమనించి బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య రేవతమ్మ, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### నకిలీ ధ్రువపత్రాల వ్యవహారంలో

# అసలు సూత్రధారి అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొగిలయ్య

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 26 : నకిలీ ధ్రువీకరణ పత్రాల వ్యవహారంలో అసలు సూత్రధారిని పట్టుకున్నట్లు డీఎస్పీ మొగిలయ్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ ధ్రువీకరణ పత్రాలను సృష్టించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వ్యవహారం విధితమే. ఈ క్రమంలో వ్యవసాయ ఉన్న తాధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా అందులో ఇప్పటికే ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే ఈ కేసులో అసలు వ్యక్తి మిర్యాలగూడకు చెందిన జూనియర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు నలుగురిని వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కేసును లోతుగా విచారిస్తున్నామని ఇంకా ఎంత మంది ఉన్నా అందరిని అరెస్టు చేస్తామన్నారు. బాలకృష్ణతో ఇంటర్మీడియట్ బీసీఏ ధ్రువీకరణ పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీను, ఎస్సై కల్యాణ్ కుమార్ రావు ఉన్నారు.





# తర్జన..భర్జన

మహబూబ్‌నగర్, (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/దోమలపెంట, ఫిబ్రవరి 26 : నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలోని ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ప్రతికూల వాతావరణం సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. బుధవారం తెల్లవారు జామున, సాయంత్రం రెండుసార్లు వెళ్లిన బృందాలు లోపల ప్రమాదం జరిగిన ప్రదేశానికి ఎట్టకేలకు చేరుకున్నాయి. సహాయక చర్యలు పర్యవేక్షించే బృందాలకు అక్కడి దృశ్యాలు షాకింగ్‌గా మారాయి. సొరంగం మొత్తం మూసుకోకపోవడంతోపాటు 15 ఫీట్ల ఎత్తు బురద పేరుకుపోయింది. ఇక్కడే టీబీఎం మిషన్ ముందు భాగం ఉంటుందని భావిస్తున్నారు. ఇది దాటితే కానీ చిక్కుకున్న వారి ప్రదేశానికి చేరుకునే అవకాశం ఉందని నిర్ధారించారు. దేశంలోని అత్యుత్తమమైన నిపుణులను రప్పించారు. మంత్రులు, ఉన్నతాధికారులు వారితో సంప్రదింపులు జరుగుతున్నా.. సహాయక చర్యలు ఇంకా కొలిక్కి రాలేదు. మరోవైపు సొరంగ ప్రమాదంలో చిక్కుకున్న వారి బంధువులు మూడ్రోజులు నుంచి దోమలపెంటలో పడిగాపులు కాస్తున్న పట్టించుకునే వారే లేరు. ప్రమాదంలో సహాయక చర్యలు మందగించాయని.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలోని బీఆర్‌ఎస్ బృందం ఘటనా ప్రాంతానికి రానున్నారు. ఈ బృందం వస్తున్న విషయం తెలుసుకున్న మంత్రులు రెండ్రోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తామని మీడియా ముందు ప్రకటించారు.

### 40 మీటర్లు కాదు 200 మీటర్లు

దోమలపెంట సొరంగం ప్రమాదంలో ఇప్పటి వరకు 40 మీటర్ల మేర బురద నీరు కూరుకుపోయిందని భావిస్తే తాజాగా అది 200 మీటర్లకుపైగా వ్యాపించిందని నిర్ధారించారు. గత 24 గంటల్లో మూడుసార్లు సొరంగంలోకి వెళ్లి వచ్చిన వివిధ బృందాలు ఇచ్చిన నివేదిక ప్రకారం సొరంగం పైకప్పు టీబీఎం మిషన్ ముందు భాగం మొత్తం కూరుకుపోయిందని.. ఫలితంగా మిషన్ ముందు దాదాపు 200 మీటర్ల వరకు బురద నిండిపోయిందని అంచనాకు వచ్చారు. టీబీఎం మెషిన్ ముందు స్వరంగ భాగంలో 15 ఫీట్ల ఎత్తు బురద చేరింది. ఈ బురద తొలగించాలంటే మిషన్‌ను గ్యాస్ కట్టర్లతో కట్ చేసి ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు సొరంగ ప్రమాదంపై కారణాలు విశ్లేషించేందుకు నేషనల్ జియో లాజికల్ సర్వే నిపుణులు ఇక్కడి మట్టిని, రాళ్లను పరిశీలిస్తున్నారు. ప్రమాదానికి కారణాలను విశ్లేషిస్తున్నారు.





టన్నెల్‌లోకి వెళ్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

### టీబీఎం మిషన్ కట్ చేయాల్సిందే..

సొరంగం తవ్వకానికి ఉపయోగించే టీబీఎం మిషన్‌ను కట్ చేయాలని ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశానికి కంపెనీ ప్రతినిధులతో పాటు వివిధ రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించే నిపుణులు పాల్గొన్నారు. సొరంగంలో ముందుకు వెళ్లాలంటే అడ్డుగా ఉన్న టీబీఎం మిషన్ కట్టర్లతో కట్ చేయాలని.. అప్పుడే అక్కడ పేరుకుపోయిన బురదను తొలగించే అవకాశం ఉన్నదని, దీనికోసం కావాల్సిన ప్లాస్మా కట్టర్లతో కట్ చేయాలని మంత్రులు ఆదేశించారు. రెస్క్యూ ఆపరేషన్ రెండ్రోజుల్లో ముగిస్తామని మంత్రులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### నేడు ఎస్ఎల్‌బీసీకి హరీశ్‌రావు బృందం



మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్‌ఎస్ బృందం దోమలపెంటకు చేరుకోనున్నది. హైదరాబాద్ నుంచి బయలుదేరి ఈ బృందం కల్వకుర్తి మీదుగా అచ్చంపేట నియోజకవర్గం హాజీపూర్‌కు ఉదయం 11 గంటలకు చేరుకుంటారని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, ఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు గువ్వల బాలరాజ్ తెలిపారు. అక్కడి నుంచి హరీశ్‌రావు నేరుగా దోమలపెంటకు చేరుకొని.. ప్రమాదం జరిగిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పరిశీలిస్తారని చెప్పారు. ఆ తర్వాత సొరంగంలో చిక్కుకున్న కార్మికుల బంధువులను పరామర్శిస్తారని వెల్లడించారు. అక్కడే మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతారని తెలిపారు.



- **ఎస్ఎల్‌బీసీ వద్ద కొలిక్కిరాని సహాయక చర్యలు**
- **కార్మికులను రక్షించేందుకు అడుగడుగునా అడ్డంకులు**
- **ఆరురోజులుగా సా..గుతున్న రెస్క్యూ ఆపరేషన్**
- **టన్నెల్‌లో 200 మీటర్లలో పేరుకుపోయిన బురద**
- **మూసుకుపోయిన సొరంగం.. ప్రతికూల వాతావరణం**
- **చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు తీవ్ర ప్రయత్నం**
- **పర్యవేక్షిస్తున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, అధికారులు**



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలో పాల్గొన్న బృందం



సొరంగంలో సహాయక చర్యల గురించి ఫోన్‌లో వివరాలు తెలుసుకుంటున్న కార్మికుల బంధువులు

# రుణమాఫీ కాలే.. రైతు భరోసా రాలే..

- **అందుకే పొలం బీడుపెట్టినా..**
- **20 ఏండ్ల తర్వాత పెట్టినందుకు బాధేస్తుంది..**
- **హజిలాపూర్ రైతు నర్సింగ్‌రావు ఆవేదన**

నవాబ్‌పేట, ఫిబ్రవరి 26 : నేను తీసుకున్న పంట రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేయలేదు..అలాగే ఆరు నెలలకోసారి రావాల్సిన పంట పెట్టుబడి డబ్బులు పడలేదు..చేసేది లేక వ్యవసాయాన్ని బంద్ చేసి.. పొలాన్ని బీడుపెట్టానని వాపోయాడు నవాబ్‌పేట మండలంలోని హజిలాపూర్ గ్రామానికి చెందిన రైతు నర్సింగ్‌రావు. ఆయన కథనం ప్రకారం నాకున్న 9ఎకరాల పొలంలో దశాబ్దాల కాలంగా పంటలు సాగు చేస్తూ..మంచి పంటలు పండిస్తున్నాను. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో ఎనిమిదేండ్లపాటు నాకు క్రమం తప్పకుండా రైతు బంధు డబ్బులు పడ్డాయి. ఆడబ్బుల తోనేపంటలు పండించాను. ఆ పంటలు అమ్మిన డబ్బులతో ఇల్లు కట్టుకొని, బిడ్డ పెండ్లి కూడా చేశాను. కాగా గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి నాకు ఎలాంటి సాయం అందలేదు. నా పేరున లక్షా 86వేల రూపాయల పంట రుణం ఉన్నది..ఇటీవల ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీలో నాకు మాఫీ కాలేదు. రుణమాఫీ కోసం గతంలో అనేక పర్యాయాలు అధికారుల చుట్టూ తిరిగాను. లేని పోని సాకులు చెప్పి తిప్పి ఇంటికి పంపారు. అలాగే ఇప్పటి వరకు రైతు భరోసా డబ్బులు కూడా రాలేవు. గతంలో పండించిన వరి ధాన్యానికి ధర లేదని వాటిని విక్రయించలేదు. బోనస్ వేస్తామని చెప్తే నమ్మకం లేక ధాన్యం అమ్మలేను..వడ్లు నా ఇంటి ఆవరణలోనే అలాగే ఉన్నాయి. పంటలు సాగు చేయాలంటే లక్షలు రూపాయలు కావాలి. నేను ప్రస్తుతం అప్పులు తెచ్చే పరిస్థితుల్లో లేను. అందుకే ఉన్న 9ఎకరాల పొలాన్ని పడావు వేశాను. 20ఏండ్ల నుంచి ఎప్పుడు కూడా పడావు పెట్టలేను..పొలం వద్దకు వెళ్తే బాధేస్తున్నది. కానీ ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడ్డదని రైతు నర్సింగ్‌రావు ఆవేదన వ్యక్తం చేస్తూ..తన మనోగతాన్ని వెల్లడించారు.



బీడు పెట్టిన పొలంలో రైతు నర్సింగ్‌రావు



శ్రీశైలంలో విద్యుద్దీపాల కాంతులు, భక్తులతో కిక్కిరిసిన భ్రామరి, మల్లికార్జున స్వామి ఆలయ సముదాయం

# శంభో శివశంభో

- **కనుల పండువగా మహాశివరాత్రి వేడుకలు**
- **శివ నామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు**
- **శ్రీశైలం, అలంపూర్‌కు పోటెత్తిన భక్తజనం**

*మహాశివరాత్రి సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని శైవ క్షేత్రాలన్నీ శివ నామ స్మరణతో మార్మోగాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే ఆలయాలన్నీ వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడాయి. శివుడికి అభిషేకాలు, క్షీరాభిషేకాలు, ఇతర పూజలు చేశారు. హరహర మహాదేవ.. శంభోశంకర.. అంటూ తరించి తన్మయత్వం పొందారు. పలు ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. అలంపూర్, కందూరు, ఉమామహేశ్వరం, పామాపురం, మన్యంకొండతోపాటు పలు ఆలయాల్లో వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీశైలం భక్తులు, శివస్వాముల రాకతో కిక్కిరిసిపోయింది.*

# బాత్‌రూంలోనే బాలిక ప్రసవం

మద్దూర్ (కొత్తపల్లి), ఫిబ్రవరి 26 : ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక మగ బిడ్డకు జన్మనిచ్చిన ఘటన నారాయణపేట జిల్లాలో చోటు చేసుకున్నది. మండలంలోని ఓ తండాకు చెందిన మైనర్ మద్దూరులోని ఓ జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. నిత్యం తండా నుంచి పాఠశాలకు వచ్చి వెళ్తుంటది. ఆమె తల్లి దండ్రులు బతుకు దెరువు కోసం ముంబయిలో ఉంటారు. బాలిక ఆమె నాన్నమ్మతో ఉంటుంది. బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు వచ్చింది. అక్కడే ఉన్న బాత్‌రూంలోకి వెళ్లగా డెలివరీ అయ్యింది. దవాఖాన సిబ్బంది గమనించి దవాఖానలో చేర్పించి చికిత్సలు అందిస్తున్నారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. వైద్యులను సంప్రదించగా.. గురువారం జిల్లా దవాఖానకు తల్లీ బిడ్డను తరలిస్తామన్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా.. వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

